# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అంతరిక్షం, రక్షణ రంగం విధానాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**

**2. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం పి4 పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**

**3. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు ఈనెల 26న శంకుస్థాపన చేయనున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

**4. ఆలయ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు**

**5. నెల్లూరు స్వర్ణాల చెరువులో నిర్వహించే రొట్టెల పండుగకు రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో అంతరిక్షం, రక్షణ రంగ విధానాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా "సుపరిపాలనలో తొలి అడుగు" పేరుతో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ రోజు సాయంత్రం జరిగే ఈ సమావేశంలో ఏడాదికాలంలో చేపట్టిన పాలనా సంస్కరణలు, తీసుకొచ్చిన మార్పులు, అందించిన సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని సమీక్షించుకునేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రాష్ట్ర మంత్రులు శాసనసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు హాజరవుతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రజల, ప్రభుత్వ, ప్రైవేట్, భాగస్వామ్యం- పి4 పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు

మేరకు రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ...32 సెకన్లు

------------------------------

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు సమావేశమైయింది. ఈ సందర్భంగా రాజధానిలో సంస్థలకు భూకేటాయింపులపై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు. మంత్రులు పి.నారాయణ, టిజి భరత్, పలువురు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

------------------------------

విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆలయ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారిని మంత్రి ఈ రోజు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయంలో అపరిష్కృతంగా ఉన్న మాస్టర్ ప్లాన్, కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం పనుల పురోగతితో పాటు పలు అభివృద్ధి పనులుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

------------------------------

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు ఈ నెల జూన్ 26న శంకుస్థాపన చేయనున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు డి. పురందేశ్వరీ పాల్గొంటారని చెప్పారు. దాదాపు 94 లక్షల కోట్ల రుపాయల అంచనా వ్యయంతో చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్టుతో గోదావరి పరివాహక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయనున్నామన్నారు. బ్రిడ్జిలంకలో బోటింగ్, టెంట్ సిటీ,గోదావరి కాలువలో బోటింగ్, గోదావరికి నిత్య హారతివంటివి ఏర్పాటు చేయనున్నామని మంత్రి వివరించారు.

------------------------------

నెల్లూరు స్వర్ణాల చెరువులో నిర్వహించే రొట్టెల పండుగకు రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏడు రోజులుపాటు నిర్వహించనుందని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్...29 సెకన్లు

------------------------------

క్రీడల ప్రాముఖ్యత పట్ల అవగాహన పెంచి, ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలకు క్రీడలలో ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశ్యంతో, "సమాజం కోసం అందరం కలిసి ముందుకు వెడదాం" అనే ఇతివృత్తంతో ఈ రోజు అంతర్జాతీయ ఒలింపిక్ క్రీడల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రాచీన గ్రీస్ దేశంలో పుట్టిన ఒలింపిక్ క్రీడలు

కొంత కాలం పాటు మరుగున పడిపోయాయి. ఫ్రెంచ్ విద్యావేత్త పియరీ డి క్యూబెర్టిన్ కృషి ఫలితంగా 1894 వ సంవత్సరం జూన్ 23వ తేదీన ప్యారిస్ లోని సోర్బెన్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఏర్పాటయింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఇదే రోజున ఒలింపిక్ దినోత్సవం జరుగుతోంది. ఈ కమిటీ ఏర్పాటుతో ఆధునిక ఒలింపిక్ క్రీడలకు నూతన అధ్యాయం మొదలైంది. క్యూబెర్టిన్‌ను ఆధునిక ఒలింపిక్ పితామహునిగా పిలుస్తారు.

---------------------------

రాష్ట్రప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయంలో ఈరోజు నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తున్నారని తెలిపారు.

---------------------------

ప్రముఖ తెలుగు పండితులు, పరిశోధకులు, ఉపన్యాసకులు దివాకర్ల వెంకటావధాని జయంతి ఈ రోజు. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామంలో జన్మించిన ఆయన.. సంస్కృత, తెలుగు, ఆంగ్ల భాషలలో ప్రావీణ్యం సంపాదించారు. ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ శిష్యునిగా ఉన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ.ఆనర్స్ పట్టా పొందారు. విశాఖపట్టణం ఎవి.వి.ఎన్. కళాశాలలో తెలుగు పండితునిగా, ఉపన్యాసకునిగా పని చేశారు. హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంధ్రోపన్యాసకునిగా, రీడర్‌గా, ప్రొఫెసర్గా పలు కీలక బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు. ఆయన పాండిత్య ప్రతిభకు గుర్తింపుగా కళాప్రపూర్ణ, కవిభూషణ వంటి బిరుదులు ఆయనను వరించాయి.

---------------------------

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం–ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు సంబంధించిన అర్హుల జాబితాను ఈ రోజు విడుదల చేసామని అడ్మిషన్ల కన్వీనర్ ఎస్ అమరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 900పాయింట్లకు పైగా క్షీణించింది. నిఫ్టీ 25వేల మార్క్‌ను కోల్పోయింది. ఉదయం 10.30 గంటలకు వచ్చిన సమాచారం మేరకు సెన్సెక్స్ 715 పాయింట్లు కోల్పోయి 81,693 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 214 పాయింట్లు కోల్పోయి 24,898 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు కొద్ది సేపటి క్రితం ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...29 సెకన్లు

====================